మీద పెళ్ళి చెయ్యటానికి జరిగే యత్నాలూ ఇందులో బాగా చూపబడ్డాయి. ఈ చిత్రంలో ఒక పెళ్ళి కాదు, చిచింద్రీ చిచ్చుబుడ్డుల పెళ్ళిఆటతో సహా నాలుగు పెళ్లిళ్లు జరుగుతాయి. పెళ్ళియొక్క పరమార్థం గురించి తెలుసుకోవలసింది నాలుగు పెళ్ళిళ్ళలోనూ ఉంది.

"పెళ్ళిచేసి చూడు" ఇంకా ఒకటి రెండు మాసాలదాకా విడుదల కాకపోవచ్చు. కాని అది బయటపడి ప్రజాదరణ అపారంగా సంపాదించిన మీదట సినిమా రంగంలో ఇప్పుడు చలామణీ అవుతున్న సిద్ధాంతాలు చాలా భాగం తారుమారు కావటమేగాక సినిమా హాస్యాన్ని గురించిన అభిప్రాయాలు కూడా చాలా గొప్ప పరివర్తన చెందితీరుతాయి.

18-1-52

స్కెచ్

# అధికారుల విధి నిర్వహణ

ఆర్. యం. చిదంబరం

బస్సాగింది. అంతా బస్సు చుట్టూ మూగారు.

కాని కండక్టరు తన భుజబలంతోను, వాక్బలంతోను అందర్నీ తరుమగొట్టాడు. పోయే వాళ్ళందర్నీ తరుమగొడుతున్నాడు కదా అని నేను దూరంగా నిలబడున్నాను.

"ఏమండోయ్! ఇన్స్పెక్టరుగారి కొక టిక్కట్టు కావాలటండీ" అని యిన్స్పెక్టరుగారి బంట్రోతు వచ్చాడు.

"ఏమండోయ్! నేనూ ఇన్స్పెక్టర్నే! కాని స్వంతంగా వచ్చాను. నాకొక టిక్కట్టిస్తారా?" అనడిగాడు మరొక ఆఫీసరు.

అంతా పకోలిన వచ్చారు. పాపం! ఇన్స్పెక్టరు కూడా కంగారు పడిపోయాడు. కండక్టరు సిగ్గుపడాడు. మొత్తానికి మా అందరికీ టిక్కట్లిచ్చాడు.

"ఏమండీ! నేను ఫ్రంటుసీటులో కూర్చోవచ్చాండీ? అది ఖాళీగా ఉన్నట్టుంది" అనడిగాను.

"వీల్లేదు అది [illegible]యిందండి" అన్నాడు కండక్టరు.

బస్సు బయలుదేరబోతోందనగా కంగారు కంగారుగా పరుగెత్తుకు వచ్చాడు మరొకడు.

"నారాయణమూర్తిగారూ! అలా ఫ్రంటు సీట్లోకి దయచేస్తారా? తమరు వస్తారని తెలీదే! ఎందాకా?" అనడిగాడు కండక్టరు.

"అలాగే" నంటూ ఆయన ఫ్రంటుసీట్లోకి దయచేశాడు. నాకు వళ్ళుమండింది. నేనడిగితే లేదన్నాడు. ఆయన్ని త్రోసేసిపోయి కూర్చుని కండక్టరు వస్తే తగిన సమాధానం చెప్పి కండక్టరు ప్రవర్తనను అందరికీ తెలియజేదామనుకున్నాను. కాని అధికారి అయిన నారాయణమూర్తిగారితో వైరం తెచ్చుకోవటం మంచిది కాదని ఊరుకున్నా.

బస్సు కొద్దిదూరం పరుగెత్తింది. "అన్నవరానికి ఖాళీఉందా బాబూ!" అనడిగాడొక ప్రయాణీకుడు.

"ఉంది. కాని తునిటిక్కట్టు కొనుక్కోవాలబ్బీ" అన్నాడు కండక్టరు.

"తుని టిక్కట్టు రాసిస్తారా బాబూ! అని అడిగాడు ప్రయాణీకుడు తెలివిగా.

"అదెలా వీలుపడుతుంది? కావాలంటే తుని టిక్కట్టుకు డబ్బులీ. అన్నవరం టిక్కట్టు రాసిస్తాను. నువ్వేం ఉత్త పుణ్యానికీయటం లేదు" అని కసిరాడు కండక్టరు.

"కొంత తప్పుతుందా" అని అతనూ మాతో కలిశాడు.

ఇంతలో ప్రొహిబిషన్ స్టేషను వచ్చింది. ఇక్కడొక గంటాపేస్తాడు. లేనిపోని గొడవ. కాని ఆశ్చర్యం! బస్సు ఆగకుండా సాగిపోతోంది. అయినా వదిలేస్తారా మహానుభావులు.

విజిల్ గట్టిగా కొట్టేస్తున్నారు. ఆపక తప్పింది గాదు కండక్టరుకు, ఇన్స్పెక్టరు వచ్చాడు. ఏమయ్యా కండక్టరు? మైకం కమ్ముతోందా? బస్సాపకుండా పోతున్నావు. ప్రొహిబిషన్ స్టేషన్ దగ్గర బస్సాపాలని తెలీదూ?" అని గుడ్లు వురిమి చూశాడు. కండక్టరు మౌనంగా ఉన్నాడు.

"ప్రయాణీకులనంతా దిగమనవయ్యా. అంతా చెక్ చెయ్యాలి."

"ఏమండోయ్! ఇన్స్పెక్టరుగారూ! నేను పదింటికి సరిగ్గా తునిలో ఉండాలి. నేనే కాదు. ఈ బస్సులోని వారంతా అర్జెంటు ప్రయాణాలే చేస్తున్నారు. కనుక క్షమించి బండిని వెళ్ళనివ్వండి. కల్లు సారాయి ఈ బండిలో లేవని నేను దృఢంగా నమ్ముతున్నాను" అని ప్రార్థించాను నేను.

"మిమ్మల్ని సలహా అడగలేదండి. మేమంతా రూలు ప్రకారం నడుచుకోవాలి. మా స్వంత కళ్ళతో తనిఖీ చేయవలసిన విధి." నేను నోరు మూసుకున్నాను.

"అబ్బ! ఏం ఖచ్చితమైన ఇన్స్పెక్టరయ్యా"

ఇన్స్పెక్టర్ కోపంగా వెనక్కి తిరిగి చూచాడు. ఆ మాటలన్న వాడెవడో తెలియలేదు కాని తెలిస్తే నమిలి మింగేసేవాడు. మండిపోతున్నాడు మహారాజు. కండక్టరు ఆపకుండా పోబోయాడు. ప్రయాణీకులంతా తిడుతున్నారు. సహించలేక పోయాడు సత్యవాది.

ప్రయాణీకులంతా దిగేశారు. అంతా వెదికారు పోలీసులు. కాని ఏం దొరకలేదు. 'ఆలస్యమైపోతోంద'ని మేమంతా గోల పెడుతున్నాం.

"కండక్టరూ! మనుష్య టైర్లలో నల్లమందు తీసుకుపోతున్నారట. ఇది ఎంతవరకు నిజం?"

"ఏమో! అది నేనింతవరకు వినలేదండి."

"మేమొకటి రెండు సార్లు ఇటువంటివి చూచాం. కనుక మేము దానిని నమ్మవలసి ఉంది. టైర్లలోని గాలంతా తీసేయండి. వాట్లలో నల్లమందుందేమో పరీక్షించాలి."

"అదేమిటండీ! ఆలస్యమైపోయిందని జనమంతా ఒకటే గోల పెడుతున్నారు. ఇక టైర్లలో గాలి వదిలేస్తే మళ్ళా గాలి కొట్టేసరికి తాతలు దిగివస్తారు" అన్నాడు కండక్టరు విసుగ్గా.

"అదంతా నా కనవసరం. ప్రతిదీ పరీక్షించవలసినది మా విధి. గాలి వదిలేస్తావా? లేక ఆ పని మేమే చేసుకోమా?"

కండక్టరు మాట్లాడలేదు. అతని వాలకం చూచి అతన్నపరాధిగా నిర్ణయించాడు ఇన్స్పెక్టరు. టకటకమని దిగివెళ్ళి టైరులోని గాలిని వదిలేశాడు. ఇక మేమంతా ఒకటే గోల పెట్టాం. మాలో ఒకడు రాయబారిగా ఇన్స్పెక్టరు దగ్గరకుపోయి నిషేధింపబడిన వస్తువులు ఎవరూ ఈ బండిలో తీసుకుపోవటం లేదని, అందుకు తామంతా హామీ యిస్తున్నామని, దయచేసి గాలి విప్పేసి ప్రయాణీకులను బాధ పెట్టవద్దని ప్రార్థించాడు. అప్పుడతను తగ్గి తన పనికి స్వస్తి చెప్పి మమ్మల్ని ఎక్కనిచ్చాడు. అంతా యిక ఫరవాలేదనుకున్నాం. కండక్టరు 'ఆలో లక్షణా' అని టైర్లోకి గాలి కొడుతున్నాడు. ఇన్స్పెక్టరు చకచకామని కాగితం మీద నాలుగు పంక్తులు వ్రాసి నాదగ్గరకు పట్టుకొచ్చాడు.

"దీనిమీద సంతకం పెట్టండి" అన్నాడు. నేనది తీసుకుని చదివాను. "ఈ బస్సులో ఎక్కడా నిషేధింపబడిన వస్తువులు దాచబడలేదని, ప్రయాణీకులు అట్టి సరకులు తమతో తీసుకుపోవటం లేదని మేమంతా హామీ యిస్తున్నాం" అని వ్రాయబడుంది. నేను విధిలేక సంతకం పెట్టాను. నాలాగే ప్రతివాడు సంతకం పెట్టాడు. ఒక్క తాత మాత్రం కాగితంలో ఏం వ్రాయబడుందో చూడనిదే సంతకం పెట్టనన్నాడు. ఇన్స్పెక్టరు చదివి వినిపించాడు. ఇంకా సందేహం తీరకపోతే నేను చదివి వినిపించాను.

ప్రొహిబిషన్ స్టేషన్ మీదుగా పోయే ప్రయాణీకులకు బయలుదేర దలచుకున్న టైముకు రెండు గంటలు ముందుగా ఉన్న బండికే పొమ్మని నా హెచ్చరిక.